ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
గురువారం | 30 మే, 2024 | పేజీలు : 04


## ఫర్టిలైజర్ దుకాణాలపై తనిఖీలు



**ప్రజాపక్షం/రేగోడు:** మండల పరిధి లోని ఫర్టిలైజర్ విత్తనాల దుకాణాలపై బుధవారం మండల వ్యవసాయ అధికారి జావిద్ ఎస్ఐ రాజయ్య ముమ్మర తనిఖీలు నిర్వహించారు. విత్తనాల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని బిల్లులు ఇవ్వాలని సూచించారు. స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. వీరితోపాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాల్లో వేగం పెంచాలి

### కలెక్టర్ భవేష్ మిశ్రా

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఆరోగ్య ఉప కేంద్రాలు నిర్మాణం తదితర అంశాలపై వైద్య, టిజియండిసి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా 63 ఉప ఆరోగ్య కేంద్రాలు నిర్మాణానికి చర్యలు చేపట్టగా 17 పూర్తి కాగా, 23 పురోగతిలో ఉన్నాయని, 9 నిధులు సమస్య వల్ల ప్రారంభం కాలేదని, 7 ఇంకనూ చేపట్టాల్సి ఉందని, 7 చోట్ల స్థల సమస్య ఉన్నట్లు తెలిపారు. వీటిలో 47 జాతీయ ఆరోగ్య మిషన్ నిధులతో చేపట్టినట్లు తెలిపారు. టెండర్ దాఖలు కాని వివరాలు అందచేయాలని ఆదేశించారు. 6 చోట్ల కేంద్రాలు నిర్మించాల్సి ఉందని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. డిఎంఎఫ్టీ నిధులతో చేపట్టిన భవనాలు నిర్మాణాలు పూర్తి చేయుటకు చర్యలు చేపట్టాలని తెలిపారు. బాగిర్తిపేట, చెన్నాపూర్, చిన్నకోడెపాక, రంగయ్యపల్లి నిర్మాణాల్లో జాప్యానికి కాంట్రాక్టరుకు నోటీసులు జారీ చేయాలని అన్నారు. బుద్దారం, చల్లగరిగలో శిథిలావస్థలో ఉన్న భవనాలు తొలగించి పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణం పూర్తయిన భవనాలకు సంబంధిత మెడికల్ అధికారి నుండి ధృవీకరణలు తీసుకోవాలని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరుపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పర్యవేక్షణ శాఖలు, ఇప్పటి వరకు యంబి నమోదులు, చెల్లించిన బిల్లులు, పెండింగ్ బిల్లులుపై నివేదిక ఇవ్వాలని తెలిపారు. స్థల సమస్య ఉన్న వాటికి రెవిన్యూ అధికారుల సమావేశంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అట్టి సమావేశానికి హాజరు కావాలని వైద్యాధికారులకు సూచించారు. తాడిచర్ల, మహాముత్తారంలో నిర్మాణంలో ఉన్న డాక్టర్ నివాస గృహాల పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, టిజియండిసి డిఈ నాగిరెడ్డి, పంచాయతీ రాజ్ డిఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# చాకరిమెట్లతో ఘనంగా పూజలు

### పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు, నీలం మధు, మదన్‌రెడ్డిలు

**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండల పరిదిలోని చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం రంగంపేట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి, ఆలయ ఫౌండర్ ఛైర్మన్ ఆంజనేయశర్మల ఆధ్వర్యంలో ఘనంగా పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో మహారుద్రాభిషేకం, లక్షతమలార్చన, మన్య సూక్త పారాయణం, పురుష సూక్త పారాయణం, శ్రీసూక్త పారాయణం వంటి పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రుస్తుంపేట ఆశ్రమ పీఠాధిపతి రాజయోగివెంకట స్వామి హాజరై పూజలు చేశారు. ఈ పూజలకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డిలు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు కొడకంచి సుదర్శన్‌గౌడ్, పూజారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





### డంపింగ్ యార్డు, వైకుంఠధామాలు

# త్వరగా పూర్తి చేయాలి



### అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

**ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి:** ఈజిఎస్ పనుల్లో డంపింగ్ యార్డు, వైకుంఠదామాల్లో పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశించారు. ఇదివరకు పూర్తయి వాడుతున్న డంపింగ్ యార్డుల్లో తడిచెత్త, పొడిచెత్త, వేరు చేసే విధానం,వైకుంఠదామాల్లో నీటి కొరత, ఎలక్ట్రిక్ కనేక్షన్లు ప్రతిది ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్ఆర్ఈజిఎస్ పనుల్లో జిల్లాలో కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. బుధవారం సిద్దిపేట సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిడిఓ, ఎంపిఓ,మెప్మా అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ తెలంగాణ హరితహారంలో మండలాల వారిగా ఇచ్చిన టార్గెట్ ఆధారంగా ఎస్టిమెట్ చేయాలన్నారు. నర్సరీలో మొక్కల పెంపకం, మొక్కలనాటడానికి సైట్‌ను అన్వేషించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వానకాలం మొదలయ్యే లోపు మొక్కల పిట్టింట్‌కు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామాల్లో మల్బరీ పెంపకాన్ని పెంపోదించేందుకు రైతులకు ప్రోత్సాహం కల్పించాలన్నారు. ఉద్యానవన శాఖలో భాగంగా పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. డ్రాగన్, ఫ్రూట్, మామిడి ఇతరత్రా లాభాదాయక పండ్ల తోటల పెంపకంపై రైతులను ప్రేరేపించాలన్నారు. ఆదర్శపాఠశాల ఇంజనీరింగ్ విభాగం పనులు త్వరగా సిద్ధం చేయాలన్నారు. జూన్ 5లోపు మొదటి విడుత స్కూల్ యూనిఫాం పంపిణి చేయాలన్నారు. తాగునీటి వసతి ఎండకాలంలో స్పెషల్ వాటర్ డ్రైవ్‌ను విజయవంతం చేసినట్లు తెలిపారు. వర్షాకాలంలో తాగునీటి వాడే విధానంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. నీటి కలుషితం కాకుండ వచ్చే డెంగ్యూ, మలేరియా వ్యాధులు రాకుండ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి జయదేవ్‌ఆర్యా, డిపిఓ దేవకిదేవి, మిషన్ భగీరథ ఎస్సీ శ్రీనివాసచారి, ఈఈ గిరిధర్ పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ దుకాణాలపై మున్సిపాలిటీ అధికారుల దాడులు

**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** వరంగల్ మున్సిపాలిటీ మెడికల్ హెల్త్ డిపార్ట్మెంట్,కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, వరంగల్,హనుమకొండ జిల్లాల వినియోగ దారుల సంఘాల సమాఖ్య అధ్వర్యంలో నిషేధిత ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల,స్పూన్లు, కప్ లు, ట్రే లు మొదలైన వస్తువులు అమ్మే బట్టల బజార్ వరంగల్ లోని వ్యాపారస్తుల దుకాణదారుల పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ దాడులలో షణ్ముఖ,హనుమాన్,లేపాక్షి,సుధా, ఎస్ ఆర్ ,ఉత్తమ్, భవానీ , హరి ఓం, హరీష్ మొదలైన 12 దుకాణాలపై మునిసిపల్ అధికారి సంపత్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది సుభాస్ లు కేసులు,జరిమానాలు వేసి నిషేధిత అక్రమ సరుకులను స్వాదీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమం లో హనుమకొండ,కన్స్యూమర్ ఫోరం అధ్యక్షులు , రాష్ట్ర క్యాట్కో ఉపాధ్యక్షుడు డాక్టర్ ఠాగూర్ రతన్ సింగ్, క్యాట్ కో రాష్ట్ర కార్యదర్శి వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షులు గిరగాని సుదర్శన్ గౌడ్ , కార్పోరేషన్ కన్వినర్ కోడిమ్యాల శ్రీనివాస్ రావు,రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మైస వసంత ,విజిలెన్స్ కమిటీ మెంబర్ లు నాగెల్లి సారంగం, బెజ్జెంకీ ప్రభాకర్, సిటీ ఇంచార్జి సిలువేరు శ్రీనివాస్ ,కుమారస్వామి,వెంకటేశ్వర్లు,రాజు 30 మంది సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎరువుల దుకాణంపై విస్తృత తనిఖీలు



**ప్రజాపక్షం/మల్హర్:** మండలంలోని కొయ్యూరు గ్రామ పంచాయతీ పరిధిలో గల ఎరువులు, పురుగు మందుల, విత్తనాల దుకాణాలలో మండల వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ తో కలిసి కొయ్యూరు. ఎస్సై వడ్లకొండ నరేష్ విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు కావలసిన అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు అందించాలని, ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి క్రయవిక్రయాలు జరపాలని దుకాణ నిర్వాహకులను ఆదేశించారు. అదేవిధంగా నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బ్లాక్ మార్కెట్లోకి విత్తనాలను తరలించి అధిక ధరలకు అమ్మితే దుకాణం యొక్క లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీసు మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రేగోడు గోకర్ణేశ్వరాలయంలో చోరీ

**ప్రజాపక్షం/రేగోడు:** మండల కేంద్రం రేగోడు లోని గోకర్ణేశ్వర ఆలయంలో చోరీ జరిగింది. రోజు మాదిరిగానే పూజారి మహేష్ సామి బుధవారం ఉదయం శ్రీ గోకర్ణ ఆలయానికి వెళ్లగా ఉండి కనిపించలేదు వెంటనే స్థానికులకు సమాచారం ఇవ్వడంతో చుట్టు పక్కల వెతకగా ఆలయానికి 500 మీటర్ దూరంలో ఉండి లభించింది. ఉండి తాళాలు పగలగొట్టి అందులోనే నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని కేశవపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ చిలుముల రాజశేఖర్ చెల్లెలు విజరాజు వివాహ వేడుకలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కేశవపురం గ్రామ పార్టీ అధ్యక్షులు ఘాజే సుధాకర్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ బండి రాజేంద్రప్రసాద్, మీడియా కోఆర్డినేటర్ లు ఉబ్బనీ నవీన్, కందుకూరీ నరేందర్, కందుకూరి రవి, కప్పల అనిల్ కుమార్, నాయకులు ఉల్లేగుల నర్సయ్య, గాజుల నరేందర్, మద్దేలా కొమ్ములయ్య, గార్వెందుల భాస్కర్, ముకేరా సంతోష్, భూక్యా రవి,డీజే శ్రీను, పీరని ప్రవీణ్, కోలా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, ప్రజలకు ఇబ్బంది కలిగించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కంకల సతీష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదుచేస్తామన్నారు. సాయంత్రం గ్రామ పరిసర ప్రాంతాల వద్ద మద్యం తాగుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారని అలా ప్రజలకు ఎక్కడైనా ఇబ్బంది కలిగితే వెంటనే అక్కడకు వచ్చి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపట్ల సమాచారాన్ని పోలీసులకు అందించాలని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కూడా కేసులు నమోదుచేస్తామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మందు తాగడంపై ప్రత్యేకంగా పోలీస్ సిబ్బందిని నియమించడం జరిగిందని వారు నిత్యం, సాయంత్రం పూట వేళల్లో బహిరంగ ప్రదేశాల్లో పర్యటిస్తున్నారని ఎవరైతే మద్యం తాగుతూ పట్టుబడితే వారిని తీసుకొచ్చి వారిపై కేసు నమోదుచేయడం జరుగుతుందన్నారు.

## ఎక్సైజ్ అధికారుల వేధింపులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



**ప్రజాపక్షం/తొర్రూరు:** ఎక్సైజ్ అధికారుల వేధింపులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధితుని భార్య, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొమ్మనపల్లి శివారు కపూర్య తండాకు చెందిన బీముడు గతంలో గుడుంబా కేసులో నిందితుడు కాగా, బుధవారం తొర్రూరు ఎక్సైజ్ పోలీసులు కపూర్య తండాలో దాడుల పేరుతో బీముడు ఇంటి వద్దకు వెళ్లి మళ్ళీ గుడుంబా విక్రయిస్తున్నావని బెదిరింపులకు గురిచేసి, అకారణంగా కొట్టడంతో బీముడు మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు, వెంటనే స్థానికులు గమనించి తొర్రూరులోని ప్రయివేటు ఆసుపత్రికి తీసుకవెళ్ళారు. ఆగ్రహించిన తండావాసులు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ముందు బైఠాయించి కాసేపు ధర్నా నిర్వహించారు. ఈధర్నాకు తొర్రూరు జెడ్‌పిటీసీ మంగలపల్లి శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఉన్నతాధికారుల జోక్యంతో ధర్నాను విరమించుకున్నారు.

## ఆగని మట్టి అక్రమ రవాణా దందా



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండలంలో మైనింగ్ పర్మిషన్ పేరుతో ప్రైవేట్‌కు మట్టిని అమ్ముకుంటూ రాత్రి, పగలు అనే తేడా లేకుండా హిటాచిల సహాయంలో టిప్పర్‌లలో మట్టిని నింపి అక్రమంగా తరలిస్తున్న మట్టి మాఫియాపై జిల్లా మైనింగ్, రెవెన్యూ, పోలీసులు, ఇరిగేషన్ అధికారులు ఎందుకు వీరిపై చర్యలు తీసుకోవడం లేదంటూ మండల ప్రజలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. మండలంలో మట్టి అక్రమ రవాణా దర్జాగా కొనసాగుతున్నా అధికారులు వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ అక్రమ మైనింగ్ మట్టి మాఫియాకు అధికార పార్టీ నేత ఒకవైపు, అధికారులు మరోవైపు ఉండి ఈ అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారా అనే అనుమానం ప్రజల్లో ఆలోచన రేకెత్తిస్తుంది. మండలంలో ఒక వైపు గుట్టను పిండి చేసి సొమ్ము చేసుకుంటుంటే మరోవైపు కెనాల్ కాలువ మట్టిని సైతం వదలకుండా అమ్ముకొని సొమ్ము చేసుకోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా వీరికి మైనింగ్ అధికారులు పర్మిషన్ ఎలా ఇస్తారంటూ పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మైనింగ్, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులు నిద్ర మత్తును వీడి మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## విద్యుత్ సంస్థలో పనిచేసే ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** విద్యుత్ సంస్థలో పనిచేసే ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించి వారిని రెగ్యులర్ చేయాలని, తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ జనగామ సర్కిల్ కార్యదర్శి ఎం కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఈ వేణుమాధవ్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ ఏడాది ఫిబ్రవరి 26న వినతిపత్రం సమర్పించడం జరిగిందన్నారు. యాజమాన్యం ఇప్పటి పట్టించుకోలేదని, ఇప్పటికైనా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలో రెగ్యులర్, ఆర్టిసన్, అన్మెన్, పీష్, రేట్, కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. జెఎల్ఎం, జెపిఎ, యూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, సబ్ ఇంజనీర్ తదితర రెగ్యులర్ పోస్టులకు కన్వర్షన్ ఇవ్వాలన్నారు. ఆన్ మ్యాన్ వ్యవస్థను రద్దు చేసి కార్మికులను సంస్థలో చేర్చి రెగ్యులర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ భగవాన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బి శ్రీను, శ్రీకాంత్, కరుణాకర్ పాల్గొన్నారు.

## మెదక్ గడ్డ కాంగ్రెస్ అడ్డ



**ప్రజాపక్షం/కౌడిపల్లి:** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెదక్ అభ్యర్థి నీలం మధు రెండు లక్షల మెజార్టీతో గెలుస్తారని మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చర్ల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం రోజు కౌడిపల్లి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం 6 గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి పూర్తిగా అమలు చేశారని, ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి రాష్ట్రంలో అధికారంలో తెచ్చారని రాహుల్ గాంధీ ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త గ్రామంలలో మెదక్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు బీసీ బిడ్డ ను గెలుపునకు పని చేశారని వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. రెండు లక్షల పైగా మెజారిటీతో నీలం మధు గెలుపొందడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, సహకారంతో మండలంలోని ప్రతి కార్యకర్త గ్రామాలలో మెజారిటీ కోసం కష్టపడి పనిచేయడం జరిగిందని కౌడిపల్లి మండలం నుంచి మంచి మెజార్టీని అందిస్తామని, మెదక్ జిల్లా అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.

## వేలాడుతున్న విద్యుత్ వైర్లు..



**ప్రజాపక్షం/రామాయంపేట:** విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా రైతులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని వ్యవసాయ పనులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. చేతికందే ఎత్తులో విద్యుత్ వైర్లు వేలాడుతున్నా అటువైపు ఆశాఖ అధికారులు కన్నెత్తి చూడడంలేదనే విమర్శలు నెలకొన్నాయి. ఎన్ని సార్లు పిర్యాదు చేసిన అధికారులు స్పందించడంలేదని రైతులు వాపోతున్నారు. రామాయంపేట పట్టణ శివారులోని బైపాస్ ప్రాంతంలో విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. వచ్చేది వర్షాకాలం సీజన్ కాబట్టి అధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆప్రాంత రైతులు వేడుకుంటున్నారు. ఆదమరిస్తే అంతే సంగతులు పెను ప్రమాదం సంబవించకముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## అనుమతి లేని పాఠశాలలను బహిర్గతం చేయాలి

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జిల్లాలో అనుమతి లేని పాఠశాలలను బహిర్గతం చేయడంతో పాటు ప్రైయివేట్ పాఠశాలల్లోని ఫీజుల్ని నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మబిక్షం డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో ఎఓ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. అధికారులు వీటిని గుర్తించి వెంటనే ఫీజులు నియంత్రించాలని కోరారు. అనుమతి లేని పాఠశాలల్ని రద్దు చేయాలని, కొన్ని పాఠశాలలు అడ్మిషన్ ఫీజు పేరుతో ఒకొకరి నుండి 5వేలకు పైగా వసూలు చేస్తున్నాయన్నారు. ఈ టెక్నో, ఐఐటి, ఇంటర్నేషనల్, ఓలంపియాడ్, డిజి పేర్లతో అధిక డబ్బులు గుంజుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దోసగాని సుమా, జిల్లా సహాయ కార్యదర్శి విగ్నేష్ పాల్గొన్నారు.

# కల్తీ విత్తనాలను అరికట్టాలి




**ప్రజాపక్షం/సంగెం:** కల్తీ విత్తనాలను అరికట్టాలని అఖిల భారత కిసాన్ ప్రిపరేషన్ ఏఐకేఎఫ్ మండలాధ్యక్షుడు గోనె రాంచందర్ అన్నారు. బుధవారం మండలంలోని కుంటపల్లి గ్రామంలో అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ ఏఐకేఎఫ్ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రౌతు శ్రీనివాస్ అధ్యక్షత వహించగా గోనె రాంచందర్ హాజరై మాట్లాడుతూ.. విత్తన షాపులపై వ్యవసాయాధికారులు విత్తనాల ప్యాకెట్ల పరిశీలన చేయాలన్నారు. నకిలీ విత్తనాలను రైతులకు అందిస్తున్న వారిపై కేసులు పెట్టాలన్నారు. రైతులందరికీ సరిపడే విత్తనాలు అందించాలని, పత్తి విత్తనాలు ఎమ్మార్పీ రేటు ప్రకారం అమ్మాలి కాని షాపు యాజమానులు వారికి ఇష్టం వచ్చిన రీతిలో విత్తనాలు అమ్ముతున్నారన్నారు. ఇందులో నకిలీ విత్తనాలు ఇప్పటికే డీలర్ల దగ్గరికీ పెద్ద సంఖ్యలో వస్తున్నాయన్నారు. వీటిని గుర్తించి ప్రభుత్వ యంత్రాంగం వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులను మోసం చేస్తున్న విత్తన యాజమానులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా రైతులందరికీ సరిపోయే విత్తనాలను, కల్తీ లేని విత్తనాలను రైతులందరికీ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డి, జక్క అశోక్, జక్క మల్లయ్య, కొమురయ్య, జక్క సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



**ప్రజాపక్షం/దామెర:** మండలంలోని తక్కళ్లపహాడ్ గ్రామంలో బుధవారం హనుమాన్ శోభాయాత్ర వైభంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ మాదారులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఏర్పాటుచేసిన హనుమాన్ శోభాయాత్రకు భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో బిక్షపతి, కిషన్, రాజు, నరేశ్, నాగరాజు, లక్ష్మణ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖ వివాహ వార్షికోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్‌లోని మదర్ థెరిస్సా అనాధాశ్రమంలో తెలంగాణ రాష్ట్ర దేవాదార, ధర్మదాయశాఖ, తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావుల వివాహ వార్షికోత్సవ వేడుకలు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమ లక్ష్మీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్థానిక కాశిబుగ్గ ఓసిటిలో గల మదర్ థెరిస్సా పిల్లల అనాధ ఆశ్రమంలో అనాధ పిల్లలకు కేక్ కట్ చేసి స్వీట్లు, చాక్లెట్స్, పండ్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో 13వ డివిజన్ సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ బొట్ల నితీష్, వరంగల్ తూర్పు సోషల్ మీడియా డివిజన్ కోఆర్డినేటర్స్ రాజశేఖర్ నేత, సంతోషిని, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులను చెల్లించి తాజా మాజీ సర్పంచ్‌లను ఆదుకోవాలి



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను చెల్లించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుర్వి యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పదవి విరమణ ఉపాధ్యాయ భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు తమ సేవల ద్వారా ప్రతి పల్లెను పట్టణాలుగా తీర్చిదిద్దారని, రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా, టార్గెట్‌లు పెట్టి మరి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు సర్పంచ్ స్వంత నిధులతో చేయించారని ఆవేదన చెందారు. ఈ ప్రభుత్వం తమ బిల్లులు చెల్లించకుండా స్థానిక సంస్థల ఎన్నికలను జరపాలని చూస్తే మాత్రం మా సర్పంచ్‌లు ప్రాణ త్యాగాలకు కూడా సిద్దంగా ఉంటామని, పెండింగ్ బిల్లును చెల్లించే వరకు ప్రభుత్వంపై తిరుగుబాటు పోరాటం చేస్తామని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దాసరి రమేష్, పాప పవన్, మద్దవేని రాములు, లత నర్సింగం, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ సర్టిఫికెట్ల గుట్టురట్టయ్యేనా ?



**ప్రజాపక్షం/వేలేరు :** హనుమకొండ జిల్లా వేలేరు మండలకేంద్రంలో గత కొంతకాలంగా (తెలంగాణ) రాష్ట్రం ఆవిర్భావనుండి కొంతమంది ముఠగా ఏర్పడి నకిలీ సర్టిఫికెట్ల దందాను కొనసాగిసున్నారనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది ఈముఠా ఏకంగా మండల( మిజిస్ట్రేట్)తహశీల్దార్ సంతకాలతో పాటు గ్రామపంచాయితీ అధికారుల సంతకాలను ఫోర్జరీలు చేసి భూమి రిజిస్ట్రేషన్ కోసం ఒకరేటు, ఇంటిస్థలం రిజిస్టేషన్ కోసం ఒక రేటు మాట్లాడుకొని భీమదేవరపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో భూములు రిజిస్ట్రేషన్ చేస్తున్నారనే నమ్మదగిన సమాచారం నిమిత్తం వేలేరు మండలతహశీల్దార్ హెచ్ కోమిని విరణకోరగా నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్నారనే విషయం తెలిసింది తక్షణమే ఇలాంటి నకిలీసర్టిఫికెట్లు తయారు చేసే ముఠాపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి తగుచర్యలు తీసుకుంటామని తెలిపారు.పోలీస్‌స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకుండా పోయిందని వరంగల్ పోలీస్ కమిషనర్‌ను సంప్రదించగా పోలీస్ కమిషనర్ భూసమస్య యొక్క వాస్తవాస్తవాలను పరిశీలించి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారిచేశారని చర్చ జరుగుతున్నా రెవెన్యూ అధికారులు,పోలీస్ అధికారులు సమస్యను పరిష్కరించకపోవడంలో ఆంతర్యమేమిటోనని మండలప్రజలలో పలురకాల అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. హనుమకొండ జిల్లా కలెక్టర్ వేలేరు మండలంలో ఏమిజరుగుతోందో ఒక్కసారి ప్రత్యేక ద్రుష్టి పెట్టి నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టును రట్టుచేయడమేకాకుండా ఓసంస్థ కబ్జా చేశారా ? లేదా రికార్డు తారుమారు చేసి నకిలీసర్టిఫెకెట్లు తయారు చేశారా దానిని వెలికితీయాలని వేలేరు మండలప్రజలు కోరుతున్నారు.

## మదర్ థెరిస్సా అనాధాశ్రమంలో పండ్లు, స్వీట్ల పంపిణీ



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావు దంపతుల వివాహ వార్షికోత్సవం వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు జీవిత కాలం సుఖ, సంతోషాలతో వర్ధిల్లాలని, మానవ సేవే పరమావధి గా, ఏ దిక్కు లేని వాళ్లకు దేవుడే దిక్కు ఆ దైవ సమానమైన ఏ దిక్కు లేని అనాద పిల్లలకు బుధవారం వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమ, లక్ష్మి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా వేడుకలు జరిగాయని తెలిపారు. అనంతరం స్థానిక కాశిబుగ్గ ఓ సీటీ లో గల మదర్ థెరిస్సా పిల్లల అనాధ ఆశ్రమం లో అనాధ పిల్లలందరి సమక్షంలో కేక్ కట్ చేసి, పిల్లలకు కేక్, స్వీట్స్, చాక్లెట్స్, పండ్లు పంచి పెట్టినట్లు సోమ లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో 13 వ డివిజన్ సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ బొట్ల నితిన్, వరంగల్ తూర్పు సోషల్ మీడియా డివిజన్ కో ఆర్డినేటర్స్ రాజశేఖర్ నేత, సంతోషిని, రాజేష్, వరంగల్ తూర్పు కాంగ్రెస్ నాయకులు బొట్ల ప్రసాద్, క్యాతం శ్రీనివాస్, అంకం రాజేష్ లతో పాటు మదర్ థెరిస్సా పిల్లల అనాధ ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారని సోమ లక్ష్మి తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ తొలి ముఖ్యమంతిర కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిర్ణయించారని హసన్‌పర్తి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్ తెలిపారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 1వ డివిజన్‌లోని ఎర్రగట్టు గుట్ట ప్రాంతంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జూన్ 1 నుంచి 3 వరకు మూడు రోజుల పాటు పూర్వ మండలంలోని గ్రామాల్లో ఘనంగా వేడుకలను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కార్యకర్తలు, పార్టీ అధించే సూచనలను అనుసరించి ముగింపు వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. జూన్ 1న గన్ పార్క్ అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్‌బండ్‌పై ఉన్న అమరజ్యోతి వరకు రాత్రి 7 గంటలకు క్యాండిల్ ర్యాలీ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రణ త్యాగాలు చేసిన అమరులకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పిస్తారు. నఆయా జిల్లాలోని దవాఖానాలు, అనాథ శరణాలయాల్లో స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తారు. ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్, ఉపాధ్యక్షుడు ఇమ్మడి రాజేందర్, దేవన్నపేట మాజీ సర్పంచ్ చుంచు రవి, నాయకులు శ్రవణ్‌కుమార్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయ అబివృద్ధికి కృషి చేస్తా



**ప్రజాపక్షం /వేలేరు :** వేలేరు మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి ఆర్థిక సహాయం చేస్తానని మాజికుడా డైరెక్టర్ బిల్ల యాదగిరి అన్నారు. బుధవారం వేలేరు మండలకేంద్రంలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో హనుమాన్ మాలదారన చేసిన హనుమాన్ స్వాములకు అన్నప్రసాదం చేశారు ఈసంధర్భంగా యాదగిరి మాట్లాడారు హనుమాన్ దేవాలయ నిర్మాణానికి తమవంతుగా ఆర్థిక సహాయం చేస్తానని హన్మంతుడు గ్రామంలోని పిల్లాపాపలు,పెద్దలను చల్లంగ చూడడమేకాకుండా సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డీలర్ షాపు నందు స్టాక్ రికార్డులు, బిల్ బుక్కులు పరిశీలించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలతో పాటు పీడీ యాక్ట్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. అనుమతి లేని ఏ ఇతర బీటీ, కలుపు మందులను తట్టుకునే పత్తి విత్తనాలు గాని ఎవరైనా అమ్మితే స్థానిక పోలీస్ స్టేషన్‌లో గానీ, మండల వ్యవసాయ అధికారికి తెలుపాలని కోరారు. అపరిచిత వ్యక్తులు తక్కువ ధరలలో విత్తనాలను విడిగా తెచ్చి అమ్మితే కొనిమోసపోవద్దని తెలిపారు.

## వ్యాపార దుకాణాలపై దాడులు చేసిన అధికారులు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్, హనుమకొండ జిల్లాల వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నిషేధిత ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల, స్పూన్లు, కప్‌లు, ట్రేలు మొదలైన వస్తువులు అమ్మే బట్టల బజార్ వరంగల్ వ్యాపారస్తుల దుకాణదారులపై మున్సిపల్, మెడికల్ హెల్త్ డిపార్ట్‌మెంట్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ దాడులలో షణ్ముఖ, హనుమాన్, లేపాక్షి, సుధా, ఎస్ఆర్, ఉత్తమ్, భవానీ, హరి ఓం, హరీష్ మొదలైన 12 దుకాణాలపై మున్సిపల్ అధికారి సంపత్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది సుభాష్‌లు కేసులు, జరిమానాలు వేసి నిషేధిత అక్రమ సరుకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ కన్స్యూమర్ ఫోరం అధ్యక్షుడు, రాష్ట్ర క్యాట్కో ఉపాధ్యక్షుడు డాక్టర్ ఠాకూర్ రతన్‌సింగ్, క్యాట్ కో రాష్ట్ర కార్యదర్శి వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్, కార్పొరేషన్ కన్వీనర్ కోడిమ్యాల శ్రీనివాస్ రావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మైస వసంత, విజిలెన్స్ కమిటీ మెంబర్‌లు నాగెల్లి సారంగం, బెజ్జంకి ప్రభాకర్, సిటీ ఇన్‌చార్జి సిలువేరు శ్రీనివాస్, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, రాజు, 30 మంది సిబ్బంది పాల్గొన్నారు.

## టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్‌ఓ

**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** జిల్లా వ్యాప్తంగా టీకాల నిర్వహణ, అనంతరం ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వారాంతపు రివ్యూ మీటింగ్ నిర్వహించాల్సిందిగా డిఎంహెచ్‌ఓ ఆదేశాలు ఉన్నందున బుధవారం మంగపేటలో నిర్వహిస్తున్న వీక్లి మీటింగ్‌కు డిఎంహెచ్‌ఓ కమలాపూర్‌లో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేసి ఆశాలకు ప్రోగ్రామ్స్ సంబంధించి తగు సూచనలు చేసిన తర్వాత మీటింగ్‌కు హాజరయ్యారు. ఈ సమావేశంలో 29 టీకా లబ్ధిదారుల వివరాలను సబ్ సెంటర్‌ల వారిగా రివ్యూ చేయగా, 18 మందికి అప్‌డేట్ చేసినట్లు మిగతా 11 మందికి ఇంకా డ్యూటీ ఉన్నదని అందరూ ఏఎన్ఎంలు తెలిపారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలు నమోదు ప్రతి సబ్ సెంటర్ ఏఎన్ఎం టార్గెట్ కూడా 32కు గాను 34 మంది గర్భిణీ స్త్రీలను నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైశాలి, డాక్టర్ వేణు, సిహెచ్‌ఓ సత్యవతి, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్‌తెలిపారు. బుధవారం మండలంలోని పెంచికల పేట సొసైటీ కార్యాలయం విత్తన గోదామును జిల్లా వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీలుగ విత్తన అమ్మకాలను పరిశీలించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. 2024/25 సంవత్సరానికి 60 శాతం సబ్సిడీలో పచ్చిరొట్ట పైర్లు అయిన జీలుగలు, జనుము విత్తనాలను అన్ని మండలాల్లో రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. వరి విత్తుకోడానికి ముందు పచ్చిరొట్ట పంట వేసుకొని నేల సారాన్ని పెంచాల్సిందిగా సూచించారు. పత్తి విత్తనాల గురించి రైతులు ఆందోళన చెందవద్దని జిల్లాలో వివిధ షాపులకు 2,50,410 ప్యాకెట్లు తెప్పించగా అందులో 1,81,790 ప్యాకెట్లు అమ్ముడయ్యాయని, ఇంకా 1,69,630 ప్యాకెట్లు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్ని బీటీ2 పత్తి విత్తనాల్లో గులాబి రంగు పురుగును తట్టుకునే ఒకే రకమైన ప్రొటీన్ ఉంటుందని, అన్ని బీటీ2 పత్తి రకాలు అంతే సమర్థవంతంగా పురుగు తాకిడిని తట్టుకుంటాయని, కొన్ని రకాల వైపు రైతులు మొగ్గు చూపవద్దన్నారు. రైతులు పత్తి, ఇతర పంటలకు సంబంధించిన విత్తనాలు కొనేటప్పుడు సీల్డ్ ప్యాకెట్లలో ఉన్న విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. లైసెన్సు గల డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన అనంతరం తప్పకుండా రశీదు తీసుకోవాలన్నారు. బీజీ 3 విత్తనాలు సాగుచేయకూడదని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మానస, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.



## ఫర్టిలైజర్ షాపుల్లో ముమ్మరంగా తనిఖీలు



**ప్రజాపక్షం/దుబ్బాక:** దుబ్బాక మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను దుబ్బాక మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. రైతులకు విక్రయించే సరుకు వివరాలను నమోదు చేయాలని, రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. నిర్ణీత ధర కంటే ఒక్క రూపాయి కూడా అదనంగా తీసుకోవద్దన్నారు. ప్రభుత్వం నిషేధించిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల పరిధిలోని హబ్సీపూర్, కమ్మర్‌పల్లి గ్రామాల్లోని రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవోలు సంతోష్‌కుమార్, హరీష్, మహేశ్, అస్మా, చైతన్య ఉన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** అనుమానస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో బుధవారం రాత్రి వెలుగు చూసింది. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన డప్పు కనకయ్య(28) అనే యువకుడు అతని తల్లి ఇద్దరు కలిసి నివాసిస్తున్నారు. అయితే మూడు రోజుల క్రితం తల్లి, కుమారుని మధ్య చిన్న పాటి గొడవ జరగడంతో అతని తల్లి సమీప బంధువుల ఇంటికి వెళ్లినట్లు వారు పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఇంటి నుండి దుర్వాసన రావడంతో ఇరు పక్కల వారు పోలీసులకు సమాచారం అందించగా, ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు ఇంటి తలుపులు తెరిచి చూసే సరికి అనుమానస్పదంగా కనకయ్య మృతి చెందినట్లుగా వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. యువకుని మృతిపై విచారణ అనంతరం పూర్తి వివరాలు బయటపడనున్నాయి.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన కవ్వంపల్లి..

**ప్రజాపక్షం/బెజ్జంకి:** మండల పరిధిలోని బేగంపేట గ్రామానికి చెందిన మామిడాల పర్వయ్య,బూర్ల రుక్కమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం స్థానిక ఎంఎల్ఏ డా.కవ్వంపల్లి సత్యనారాయణ మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.వీరి వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షులు ముక్కీస రత్నాకర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గ దామోదర్,పులి సంతోష్ గౌడ్,పార్టీ నాయకులు తదితరులున్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/రాయపర్తి:** నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి ఉషా దయాల్ అన్నారు. బుధవారం మండలం లోని రాయపర్తి, కొండూరు, మైలారం, మహబూబ్ నగర్, పెరికెడు గ్రామాలలో సీడ్, ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యత లేని, కల్తీ విత్తనాలు అమ్మినచో సంబంధిత డీలర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం విత్తన ఎంపిక, కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వరి కంటే ముందు పచ్చి రొట్ట పైరు తప్పనిసరిగా వేసుకోవాలనీ, వరి ని వీలైనంతవరకు నేరుగా నారు మడి లేకుండా వెదజల్లే పద్ధతిలో సాగు చేయాలని సూచించారు. పంటల అవశేషాలను తగలబెట్టకూడదనీ భూమిలో కలియదున్నాలనీ అన్నారు. పత్తి లో అంతర పంటగా కంది పంటను సాగు చేయాలని అన్నారు. ప్రతి నవంబర్, డిసెంబర్ నెలలో పంట తీసిన తర్వాత రెండవ పంటగా ఆరుతడి పంటలు వేసుకున్నట్లయితే గులాబీ రంగు పురుగుల వంటి సమస్య ఉండదనీ రైతులు పంట మార్పిడి దిశగా ఆలోచించాలని అన్నారు. నాణ్యమైన విత్తనాలను రైతులు ఎన్నుకోవాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో కన్సల్ టెంట్ జాతీయ ఆహార భద్రత మిషన్ అధికారి సారంగం, ఉమ్మడి వరంగల్ జిల్లా టెక్నికల్ అధికారి సి.హెచ్.కృష్ణా రెడ్డి, మండల వ్యవసాయ అధికారి గుమ్మడి వీర భద్రం, వ్యవసాయ విస్తరణ అధికారులు రాజేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాలు కొనుగోలుపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/పావన్నపేట:** వరి విత్తనాలు కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన సదస్సు కల్పించారు. బుధవారం మండల పరిధిలోని యూసుఫ్‌పేటలో జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లూజుగా ఉన్న సంచులలో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయ రాధన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ రసీదు పంటకాలం పూర్తయంత వరకు జాగ్రత్త గా పెట్టుకోవాలన్నారు. ప్యాక్ చేసి లేబుల్ ఉన్న విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు ఎవరైనా అమ్మితే అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ, ఏఈఓ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిజానికే మాయని మచ్చ తెస్తున్న ఈసంపెల్లి సురేందర్



**ప్రజాపక్షం/మంగపేట:** మంగపేట మండలం బుచ్చంపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయగా గ్రామ అధ్యక్షులు కాటూరి నాగయ్య హాజరై మాట్లాడుతూ ఈసంపల్లి సురేందర్ అనే వ్యక్తి ఒక చిన్న డిజిటల్ పేపర్ లో విలేకరిగా చేస్తూ మీడియా ముసుగులో ఉంటూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తు జర్నలిజానికే మాయని మచ్చ తెస్తున్నారు అని అన్నారు. వివరాల్లోకి వెళితే గ్రామంలోని తన సమీప బంధువు అయినా ఎర్ర వెంకన్న అనే వ్యక్తికి రోజు మద్యం తాగిస్తు గత 15 రోజుల నుండి రాష్ట్ర మంత్రి సీతక్క ని వ్యక్తిగతంగా అశ్లీశంగా అసభ్య పదజాలంతో దూషిస్తూ గ్రామంలోని రోడ్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నందుకు గ్రామంలో ప్రజలు పెద్దమనుషుల సమక్షంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన సురేందర్ సమీప బంధువైన ఎర్ర వెంకన్నను పిలిచి అందరి ముందు అతడు దూషించిన విషయంపై సాక్ష్య ఆదారాలతో అందరి సమక్షంలో నిరూపించడం జరిగింది. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి ఏంపల్లి సమ్మయ్య, మాజీ ఆత్మ చైర్మన్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, గ్రామ ప్రధాన కార్యదర్శి రాచకొండ సోమయ్య, యూత్ గౌరవాధ్యక్షులు జంగం భానుచందర్, గద్దం పరమేష్ ఎర్ర నరేష్, నక్క శ్రీను పల్లె శోభన్ బాబు, గద్దం శ్రీహరి నాగెల్లి పరుశురాం బంటు రామన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలి

**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:** పార్లమెంట్ ఎన్నికలు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ముగిసినందున ఎన్నికల కమీషన్ అనుమతితో ఎన్నికల ప్రవర్తన నియామావళి సడలింపు తీసుకుని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు, రాష్ట్ర స్టడీ సర్కిల్ సభ్యుడు మంగు జయప్రకాశ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు యూయస్పీసి, జాక్టో ప్రతినిధులతో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం జరిపిన చర్చల్లో ఎన్నికల సంఘం అనుమతి తీసుకుని వెంటనే షెడ్యూల్ విడుదల చేస్తామన్నారని కానీ నేటి వరకు ఎన్నికల సంఘానికి ప్రభుత్వం నుండి లేఖ పంపకపోవడం విచారకరమని ఆయన ఆవేధన వ్యక్తం చేశారు. గత అక్టోబర్‌లో బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్స్ అందరినీ రిలీవ్ చేసి నూతన పాఠశాలలకు పంపించాలని, గిరిజన సంక్షేమ పాఠశాలలు, గురుకులాల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను కూడా వెబ్ కౌన్సిలింగ్ ద్వారా వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలని జయప్రకాశ్ డిమాండ్ చేశారు.

## విత్తన కొనుగోలుపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** విత్తన కొనుగోలుపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కార్యక్రమం గోవిందరావుపేట మండల వ్యవసాయాధికారి జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మచ్చాపూర్ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిఏఓ విజయచంద్ర, ఏడిఏ ఎన్ శ్రీధర్‌లు పాల్గొని రైతులకు తగు సూచనలు కల్పించారు. రైతులు నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయశాఖ జారీ చేసిన లైసెన్స్ గల డీలర్స్ వద్ద నుండి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సూచించారు. విత్తనాలు ఎంఆర్‌పి ధరల కన్న ఎక్కువ డబ్బులు చెల్లించకూడదని సూచించారు. ఎవరైనా విత్తన డీలర్లు ఎంఆర్‌పి ధరల కన్నా ఎక్కువకు అమ్మితే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి రైతు కొనుగోలు సమయంలో బిల్ తప్పనిసరిగా తీసుకోవాలని, బిల్‌పైన తీసుకున్న విత్తన కంపెనీ పేరు, రకం, లాట్ నెంబర్, గడువు తేదీ డీలర్ సంతకం, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలని, బిల్‌తో పాటు ఖాళీ విత్తన ప్యాకెట్ లేదా సంచులను పంటకాలం పూర్తి అయ్యేదాకా భద్రపరుచుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన జీలుగ, ఇతర విత్తనాలు జిల్లాలో ఉన్నాయని, ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ సంవత్సరం నుండి రాష్ట్ర ప్రభుత్వమే రైతుల ప్రీమియం చెల్లించి అందరికి ఫసల్ బీమా యోజన వర్తింపజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ గోపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వాతి, రైతులు పాల్గొన్నారు.

## సకాలంలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించాలి

**ప్రజాపక్షం/తొర్రూరు :** విద్యార్థులకు ఈసంవత్సరం సకాలంలో ఏకరూప దుస్తులను అందించాలని డిఆర్‌డిఎ డిపిఎం నలిని నారాయణ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందించే ఏకరూప దుస్తులను మహిళా సమాఖ్య దుస్తులను సకాలంలో కుట్టడం పూర్తి చేసి మండల విద్యావనరుల కేంద్రానికి అందించే ప్రక్రియలో భాగంగా బుధవారం మండల నోడల్ ప్రధానోపాధ్యాయులు మహంకాళి బుచ్చయ్యతో కలిసి మండలంలోని అమ్మాపురం, వెలికట్ల, కంటాయపాలెం క్లస్టర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాన్ని నాలుగు క్లస్టర్లుగా విభజించి మహిళా సంఘాలకు ఉపాధి కల్పన మరియు స్థానికంగా కుట్టించడంతో సకాలంలో విద్యార్థులకు అందించవచ్చున్నారు. ప్రతిరోజూ నివేదిక అందించాలన్నారు. పాఠశాలలు తెరిచే సమయానికి దుస్తులు కుట్టడం పూర్తి కావాలన్నారు. ఈకార్యక్రమంలో ఎపిఎం సంజీవరావు, మహిళా సమాఖ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.